



కాళోజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

నామినేటెడ్ పదవుల భర్తీకి శ్రీకారం!



ఇప్పటికే రాష్ట్రస్థాయిలో జిల్లాకు కీలక పదవులు

- త్వరలో ప్రభుత్వ ఉత్తర్వులు వెల్లడి
- 'నుడా' చైర్మన్‌గా కేశవేణుకు అవకాశం?
- మార్కెట్ కమిటీ చైర్మన్‌గా గంగారెడ్డి! గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా రాజరెడ్డికి చాన్స్
- మిగతా నామినేటెడ్ పదవులు కూడా త్వరలో భర్తీ
- కీలక పదవుల కోసం ప్రయత్నాలు చేస్తున్న నేతలు

నిజామాబాద్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కాంగ్రెస్ సీనియర్ నేతలకు నామినేటెడ్ పదవులు ఖరారు కానున్నాయి. ఇప్పటికే జిల్లాకు చెందిన కొంతమంది నేతలకు రాష్ట్ర స్థాయిలో కార్పొరేషన్ చైర్మన్ పదవులు కట్టబెట్టగా మరికొంత మందికి జిల్లా స్థాయిలో పదవులు ఇచ్చేందుకు నిర్ణయమైనట్లు పార్టీ వర్గాల సమాచారం బట్టి తెలుస్తోంది. కాంగ్రెస్‌లో సీనియర్‌గా ఉండి దీర్ఘకాలికంగా పనిచేస్తున్న నేతలకు ఎమ్మెల్యేలు సూచించిన వ్యక్తులకు ఈ పదవులను కట్టబెడుతున్నట్లు సమాచారం. జిల్లాలో ప్రధానమైన 'నుడా' చైర్మన్‌తో పాటు పాలక వర్గ సభ్యులను కూడా ఖరారు చేశారు. కీలకమైన ఆదాయం ఉన్న నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీతో పాటు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవి కూడా ఖరారు చేసినట్లు సమాచారం. ఇప్పటికే సంబంధిత నేతలకు సమాచారం ఇవ్వగా మూడు రోజుల్లో వీటికి సంబంధించిన ఉత్తర్వులను వెలువర్చనున్నట్లు తెలుస్తోంది. ఈ పదవులతో పాటు మిగిలిన నామినేటెడ్ పదవులను ఖరారు చేస్తున్నట్లు సమాచారం. పదేళ్ల పార్టీలో పనిచేసి పదవుల కోసం వేచి చూస్తున్న సీనియర్ నేతలకు ఈ పదవులను కట్టబెడెతున్నారు. జిల్లాకు చెందిన ఒకరిద్దరు సీనియర్ నేతలకు కూడా రాష్ట్రస్థాయి మిగిలిన కార్పొరేషన్ చైర్మన్ల భర్తీలో అవకాశం ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. మొత్తంగా నామినేటెడ్ పదవులు భర్తీ అయిన తర్వాత వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో మిగిలిన నేతలకు టికెట్లు ఇవ్వడంతో పాటు కీలకమైన పదవులను కట్టబెట్టనున్నట్లు సమాచారం.

పోస్టుల భర్తీకి నిర్ణయం..

జిల్లాలోని కీలకమైన నామినేటెడ్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్‌రెడ్డి, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డితో పాటు కొత్తగా నియమితులైన పీసీసీ అధ్యక్షుడు ఎమ్మెల్సీ బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్‌తో పాటు నియోజకవర్గ ఇన్‌చార్జిల సూచనలకు అనుగుణంగా ఈ పోస్టులను భర్తీ చేయనున్నట్లు సమాచారం. కాంగ్రెస్ నగర అధ్యక్షుడిగా 14ఏళ్లగా పనిచేస్తున్న కేశవేణుకు నిజామాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్‌గా నియామకం చేస్తున్నట్లు సమాచారం. మూడు రోజుల క్రితం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన సమయంలో ఈ విషయం చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. సీఎం స్వయంగా చెప్పడంతో రెండు మూడు రోజుల్లో నుడా చైర్మన్‌గా కేశవేణును నియమిస్తూ ఉత్తర్వులు వెలువరనున్నట్లు తెలిసింది. ఆయనతో పాటు పాలకవర్గం సభ్యులను కూడా నియామకం చేస్తున్నట్లు పార్టీ వర్గాల సమాచారం బట్టి తెలుస్తోంది. నిజామాబాద్ నగరంతో పాటు రూరల్, బోధన్, ఆర్మూర్ నియోజకవర్గం పరిధిలో నుడా విస్తరించి ఉంది. నుడా సుమారు 75 గ్రామాల పరిధిలో ఉంది. కీలకమైన నిర్మాణాలన్నీ నుడా పరిధిలోనే కొనసాగుతున్నాయి. నగర అభివృద్ధికి నుడా తోడ్పాటును అందించడంతో పాటు శివారులో కాలనీల అభివృద్ధి, గ్రామాల్లో పనులు చేయడంతో పాటు నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడంలో నుడా ప్రముఖమైన పాత్ర పోషిస్తుంది. నిజామాబాద్ అభివృద్ధికి ఇది కీలకం కావడంతో పాటు నిధులు కూడా ఉండటంతో సీనియర్ నేతకు అవకాశం ఇస్తున్నట్లు తెలుస్తోంది. నుడా తర్వాత అతి కీలకమైన నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని కూడా ఖరారు చేసినట్లు సమాచారం. రూరల్ నియోజకవర్గానికి చెందిన సీనియర్ నేత ముప్ప గంగారెడ్డికి అవకాశం ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ఒకవేళ ఏవైనా కారణాలు మారితే సీనియర్ నేత శేఖర్ గౌడ్‌కు వచ్చే అవకాశం ఉంది. ఈ చైర్మన్ పదవితో పాటు పాలక వర్గ సభ్యులను కూడా నియామకం చేయనున్నారు.

మూడేళ్లుగా పాలకవర్గం లేదు..

మూడు సంవత్సరాలకు పైగా చైర్మన్ పాలక వర్గం లేకుండానే మార్కెట్ కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. మార్కెట్‌కు వచ్చే రైతుల సమస్యలను పట్టించుకునే వారు లేరు. గత ప్రభుత్వ హయాంలో వివిధ కారణాలతో ఈ పదవులను భర్తీ చేయలేదు. ప్రస్తుతం నిర్ణయం కావడం వల్ల మార్కెటింగ్ శాఖ ద్వారా ఈ ఉత్తర్వులు వెలువరనున్నాయి. జిల్లాలో కీలకమైన గ్రంథాలయం సంస్థ చైర్మన్ పదవిని కూడా ఖరారు చేసినట్లు తెలుస్తోంది. ఈ పదవికి ప్రొటోకాల్ కూడా ఎక్కువగా ఉండటం, అన్ని సభలు, సమావేశాల్లో హాజరయ్యే అవకాశం కూడా ఉంది. ఈ సంస్థకు గత కొన్ని నెలలుగా పాలకవర్గం లేదు. కాంగ్రెస్‌కు చెందిన అంతిరెడ్డి రాజరెడ్డికి ఈ పదవిని దాదాపు ఖరారు చేసినట్లు సమాచారం. ఆయన వేరే పదవి కోసం అడిగినా ఈ పదవి ఇవ్వనున్నట్లు తెలిసింది. దీనికి సంబంధించి కూడా పూర్తిస్థాయిలో ఖరారు చేసి ఉత్తర్వులను వెలువర్చే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాల ద్వారా సమాచారం. ఈ మూడు నామినేటెడ్ పదవులు జిల్లాలో కీలకం కావడంతో పార్టీలో కీలకంగా వ్యవహరించిన నేతలకు వీటిని కట్టబెడుతున్నారు.

సీనియర్ నేతలకు అవకాశం..

జిల్లాకు చెందిన కొందరు సీనియర్ నేతలకు నామినేటెడ్ పదవుల్లో అవకాశం ఇవ్వనున్నట్లు సమాచారం. మిగతా నేతలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో జడ్పీటీసీలు, ఎంపీటీసీలుగా అవకాశం ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. గెలిచిన వారికి కీలకమైన ఎంపీపీలు, జడ్పీచైర్మన్, వైస్ చైర్మన్‌గా అవకాశం ఇవ్వనున్నట్లు పార్టీ నేతలు తెలిపారు. ఈ పదవులతో పాటు జిల్లాలోని నిజామాబాద్ కార్పొరేషన్, బోధన్, ఆర్మూర్, భీంగల్ మున్సిపాలిటీల్లో కౌన్సిలర్‌గా, కార్పొరేటర్‌గా అవకాశం ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. సీనియర్ నేతలకు రిజర్వేషన్ బట్టి చైర్మన్‌గా నియమించనున్నారు. ఈ పదవులే కాకుండా కీలకమైన పార్టీల్లో కూడా పదవులను కల్పించనున్నట్లు సమాచారం. జిల్లా నుంచి మరో ఇద్దరు నేతలకు రాష్ట్రస్థాయిలో కార్పొరేషన్ పదవుల్లో అవకాశం ఇవ్వనున్నట్లు తెలిసింది. మిగతా సీనియర్ నేతలకు రాష్ట్ర పీసీసీలో అవకాశం కల్పించడంతో పాటు మిగతా వారికి జిల్లా కాంగ్రెస్ పార్టీలో అవకాశం ఇవ్వనున్నట్లు సమాచారం. రాష్ట్రంలో పార్టీ అధికారంలో ఉండటం వల్ల పార్టీ పదవులు నిర్వహించే వారు కూడా తగిన అవకాశాలు ఉండటంతో కీలకమైన వ్యక్తులను ఈ పదవుల్లో నియమించనున్నట్లు తెలుస్తోంది. మొత్తంగా పూర్తిస్థాయిలో పదవులను భర్తీ చేయడంతో పాటు సీనియర్ నేతలకు అవకాశాలు ఇవ్వనుండటంతో ఎక్కువ మంది నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు.

ఘనంగా కాళోజీ జయంతి

- నివాళులర్పించిన జడ్పీ మాజీ చైర్మన్

సుభాష్‌నగర్, సెప్టెంబరు 9: జిల్లా వ్యాప్తంగా కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సోమవారం నగరంలోని బోయిగల్లిలోగల కాళోజి విగ్రహానికి జడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్ర ఉద్యమంలో 25 ఏళ్ల పాటు జైలు జీవితం అనుభవించిన గొప్ప వ్యక్తి కాళోజీ రావు అని అన్నారు. అనంతరం తెలంగాణ ఉద్యమంలో కలం, గళం విప్పి పోరాడిన వ్యక్తి కాళోజి నారాయణ రావు అని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వరంగల్‌లో హెల్త్ యూనివర్సిటీకి కాళోజి నారాయణరావు పేరు పెట్టిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. కాళోజి జయంతిని తెలంగాణ భాషా దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆయన సేవలను గుర్తించి పద్మ విభూషన్ అవార్డు ఇచ్చిందన్నారు. తెలంగాణ ఉద్యమంలో యువతను ప్రేరేపించిన వ్యక్తి కాళోజి నారాయణరావు అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ శంకర్, సీతారాం తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కోర్టులో కాళోజీ జయంతి..

నిజామాబాద్ లీగల్, సెప్టెంబరు 9: హైదరాబాద్ సంస్థాన విమోచన కోసం ఉద్యమం నడిపిన కాళోజీ నారాయణ రావు ప్రజాజీవితం ఆదర్శనీయమని జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్ మోహన్‌గౌడ్ అన్నారు. కాళోజీ 110వ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జగన్ మోహన్ గౌడ్ మాట్లాడుతూ.. కవితలు, కథలు రచించి ప్రజా ఉద్యమానికి పునాదులు వేసారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు రాజ్‌కుమార్ సుబేదార్, ఆశా నారాయణ, శ్రీకాంత్, సుజిత్ పాల్గొన్నారు.

వినాయక పూజలు..

జిల్లా కోర్టులో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక పూజలో జిల్లా న్యాయాధికారి సునిత కుంచాల, అదనపు జిల్లా జడ్జి ఆశలత, సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి, జూనియర్ సివిల్ జడ్జి వడ్డి హరికుమార్, కుష్బు చటోపద్యాయ పాల్గొని కోర్టు ఆవరణలో ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లెపూల జగన్ మోహన్ గౌడ్, న్యాయవాదులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి టైక్వాండో పోటీలకు జిల్లా క్రీడాకారులు

సుభాష్‌నగర్, సెప్టెంబరు 9: ఖేలో ఇండియా మహిళల టైక్వాండో జాతీయ స్థాయి పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికైనట్లు జిల్లా టైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి కోచ్ మనోజ్‌కుమార్ తెలిపారు. సీనియర్ విభాగంలో నేహ, జూనియర్ విభాగంలో వైసాక్షి అక్కలు ఎంపికయ్యారని తెలిపారు. వీరు ఈనెల 11 నుంచి 14 వరకు తమిళనాడు రాష్ట్రం డిండిగల్ జిల్లా కేంద్రంలో జరుగనున్న జాతీయ స్థాయి పోటీలో పాల్గొంటారని తెలిపారు. జాతీయ స్థాయి పోటీలో పాల్గొనే క్రీడాకారులను జిల్లా న్యాయాధికారి సునీత కుంచాల అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టైక్వాండో జిల్లా కోశాధికారి వెంకటరమణ, వైసాక్షి సంతోష్, తదితరులు పాల్గొన్నారు.



ఎస్సారెస్పీ గేట్ల మూసివేత

- ప్రధానకాలువలకు కొనసాగుతున్న నీటి విడుదల
- ప్రాజెక్టులోకి 26వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

మెండోర, సెప్టెంబరు 9: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు వరద గేట్లను మూసివేశారు. సోమవారం రాత్రి ప్రాజెక్టులోకి 26వేల897 క్యూసెక్కుల వరద స్వల్పంగా రావడంతో ప్రాజెక్టు ఐదు వరద గేట్లను మూసివేశామని ప్రాజెక్టు ఈఈ చక్రపాణి తెలిపారు. ఉదయం 89వేల 377క్యూసెక్కుల వరద చేరడంతో 20వరద గేట్ల ద్వారా 62వేల480క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేశారు. మధ్యాహ్నం ప్రాజెక్టులోకి 55వేల క్యూ సెక్కుల వరద తగ్గుముఖం పట్టడంతో తొమ్మిది గేట్ల ద్వారా గోదావరిలోకి నీటిని విడుదల చేశారు. సాయంత్రం ప్రాజెక్టులోకి వరద 42వేలు క్యూసెక్కుల వరద చేరగా ఐదు వరద గేట్ల ద్వారా 15వేల 620 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదిలారు. అయితే సాయంత్రం వరద తగ్గుముఖం పట్టడంతో గేట్లను మూసివేశారు. ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువల 4వేల క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 4వేల క్యూ సెక్కులు, ఆవిరి రూపంలో 666మిషన్ భగీరథ తాగు నీటి కోసం 231వరద కాలువకు 18వేల క్యూ సెక్కుల నీటి విడుదల జరుగుతుందని తెలి పారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు (80.5టీఎంసీలు) కాగా సోమవారం సాయంత్రంకి 1090.90 అడుగులు (80.053టీఎంసీ)లు నీటి నిల్వ ఉందని, గత ఏడాది ఇ దో రోజు ప్రాజెక్టులో 1090.60 అడుగులు (80.053 టీఎంసీ)ల నీటి నిల్వ ఉందని తెలిపారు. జూన్ 1వ తేదీ నుంచి ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి 165 టీఎంసీల నీరు వచ్చి చేరిందని ప్రాజెక్టు ప్రధాన కాల్వలకు 92టీఎంసీలు నీరు విడుదల చేయడం జరిగిందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

జిల్లాలో పంట నష్టం అంచనా

- ప్రాథమిక నివేదికను ప్రభుత్వానికి నివేదించిన అధికారులు



చీమన్‌పల్లిలో మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

నిజామాబాద్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటల వివరాలను అధికారులు సేకరించారు. గత వారంలో పడిన భారీ వర్షాల వల్ల సోయా, వరి పంటలు దెబ్బతిన్నట్లు అధికారులు గుర్తించారు. పంట చేనులో నీళ్ల చేరడం వల్ల భారీగా నష్టం జరిగినట్లు అంచనా వేశారు. గోదావరి నదీ పరీవాహక ప్రాంతంతో పాటు పలు గ్రామాల పరిధిలో వాగులు పొంగడం వల్ల ఈ పంటలు దెబ్బతిన్నాయి. ఆయా మండలాల పరిధిలో సర్వే నిర్వహించిన అధికారులు నివేదికను సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించారు. జిల్లాలో వారం కురిసిన భారీ వర్షాల వల్ల వాగులు పొంగాయి. పలు ప్రాంతాల్లో పంట చేనులు జలమయం అయ్యాయి. మూడు నాలుగు రోజుల పాటు పంట చేనులో నీళ్లు నిలిచి ఉండటం వల్ల సోయా పంట ఎక్కువగా దెబ్బతింది. గోదావరి బ్యాక్ వాటర్ వల్ల పలు గ్రామాల పరిధిలో ఈ పంట చేనులకు నీళ్లు చేరాయి. ఎక్కువ రోజులు నీళ్లలో పంట మునిగి ఉండటం వల్ల నష్టం జరిగింది. జిల్లాలో సోయాతో పాటు వరి, కొద్దిగా మొక్కజొన్న దెబ్బతిన్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు గుర్తించారు. జిల్లా వ్యాప్తంగా 2683 ఎకరాల్లో పంటకు నష్టం జరిగినట్లు అంచనా వేశారు. ప్రభుత్వానికి ప్రాథమిక నివేదిక పంపించారు. పంటకు పెట్టిన పెట్టుబడితో పాటు ఇతర ఖర్చులను కలిపి నష్టం వివరాలను అంచనా వేశారు. వర్షాల ఆధారంగా పండే పంటలతో పాటు కాలువల ద్వారా పండే పంటలకు సంబంధించిన వివరాలను ప్రాథమిక నివేదికలో పొందుపర్చారు. ఎకరానికి పెట్టిన పెట్టుబడికి అనుకూలంగా ఈ నివేదికను తయారు చేసి ప్రభుత్వానికి పంపించారు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయం ఆధారంగా పంట దెబ్బతిన్న రైతులకు పరిహారం అందనుంది.





విద్యాశాఖలో ఇన్‌చార్జిల పాలన!

- జిల్లాలో ఎంఈవో పోస్టులు ఖాళీ
- 33మండలాలకు రెగ్యులర్ అధికారులు కరువు
- ఒకే ఒకరు రెగ్యులర్.. ఆరుగురికి ఇన్‌చార్జి బాధ్యతలు
- అదనపు బాధ్యతలతో హెచ్‌ఎంల సతమతం
- జిల్లాలో గాడి తప్పుతున్న విద్యావ్యవస్థ

కోటగిరి, సెప్టెంబరు 9: జిల్లా విద్యాశాఖలో ఇన్‌చార్జిల పాలన కొనసాగుతోంది. ఉప విద్యాధికారుల పోస్టులతో పాటు ఎంఈవోలు, గెజిటెడ్ హెచ్‌ఎం పోస్టులు భర్తీకి నోచుకోకపోవడంతో విద్యా వ్యవస్థ గాడి తప్పుతోంది. రెగ్యులర్ ఎంఈవో పోస్టులను భర్తీ చేయకపోవడంతో మండలాల పరిధిలోని సీనియర్ ప్రధానోపాధ్యాయులు ఇన్‌చార్జి ఎంఈవోలుగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ, ఉపాధ్యాయుల పనితీరు, మధ్యాహ్న భోజన అమలు, సర్వశిక్షా అభియాన్ చేపట్టే విద్యాభివృద్ధి కార్యక్రమాల పర్యవేక్షణలో ఎంఈవోల పాత్ర కీలకం. పాఠశాలల పని ఒత్తిడితో పాటు అదనపు బాధ్యతలు వారికి తలకు మించిన భారంగా మారాయి. తాము విద్యార్థులకు పూర్తిస్థాయిలో న్యాయం చేయలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్న సందర్భాలు సైతం ఉన్నాయి. పాఠశాలలపై పర్యవేక్షణ కరువవ్వడంతో ఉపాధ్యాయులు సమయపాలన పాటించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో విద్యా వ్యవస్థ గాడి తప్పుతోంది. సర్వీస్ రూల్స్ ప్రమోషన్ల అడ్డంకి సాకులు చూపుతూ సీనియర్ హెచ్‌ఎంలే ఎంఈవోలుగా నియమిస్తూ చేతులు దులుపుకుంటున్నారు.

ఉప విద్యాధికారులు ఇన్‌చార్జులే..

నిజామాబాద్ జిల్లాలో మూడు డివిజన్‌లో ఉన్నాయి. ఆర్మూర్, నిజామాబాద్, బోధన్ డివిజన్‌లలో ఇన్‌చార్జిలను సైతం నియమించకపోవడం గమనార్హం. పాఠశాలల నిర్వహణ, పనితీరు, మధ్యాహ్న భోజనం అమలు, ఆర్‌వీఎం చేపట్టే కార్యక్రమాలను ఎప్పటికప్పుడు పరిశీలించి జిల్లా విద్యాధికారికి నివేదిక ఇవ్వాల్సిన బాధ్యత ఉప విద్యాధికారులపైనే ఉంది. ఉప విద్యాధికారులు జిల్లాలో ఉన్నారో లేరో అనే పరిస్థితి తలెత్తింది.

పనులపై పర్యవేక్షణ ఎలా..

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో జరుగుతున్న తప్పిదాలు, అనుమతుల విషయమై పర్యవేక్షణ ఉండాలి. ప్రస్తుతం ఇన్‌చార్జి ఎంఈవోలతో ఇవేమి సక్రమంగా జరగని పరిస్థితి. పదో తరగతి పరీక్షల నిర్వహణతో పాటు ఓపెన్ టెన్త్, ఇంటర్, టైప్ రైటింగ్, టైలరింగ్, ఎంబ్రాడరీ, డ్రాయింగ్, బీఎడ్, డీఎడ్ ప్రవేశ పరీక్షలను డిప్యూటీ డీఈవో నిర్వహించాల్సి ఉంటుంది. ఆ పోస్టుల్లో ఎవరు లేకపోవడంతో డీఈవోనే నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది.

మండలంలో 50వరకు పాఠశాలలు..

ప్రతి ఎంఆర్‌సీలో రెగ్యులర్ మండల విద్యాధికారితో పాటు జూనియర్ అసిస్టెంట్, అటెండర్, నైట్ వాచ్‌మెన్ ఉండాలి. కానీ ఒక్క ఎంఈవోనే అన్ని తానై ఈ పనులు చేసుకోవాల్సి వస్తుంది. శాశ్వత సిబ్బంది లేక కాంట్రాక్ట్ ప్రతిపాదికన పనులు చేయించాల్సిన పరిస్థితి తలెత్తింది. ప్రతి మండలంలో 50కి పైగా పాఠశాలల పర్యవేక్షణతో పాటు ఉపాధ్యాయుల పనితీరును పరిశీలించాల్సి ఉంది.

జిల్లాలో ఎంఈవోల పరిస్థితి ఇలా..

జిల్లాలోని 33మండలాల్లో ఒక రెగ్యులర్ ఎంఈవో ఉండగా ఆరుగురు ఇన్‌చార్జి ఎంఈవోలు ఉన్నారు. చందూర్ మండలం గోపూర్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న నాగనాథ్ 9మండలాలకు ఇన్‌చార్జి ఎంఈవోగా వ్యవహరిస్తున్నారు. ఆయన పరిధిలో బోధన్, సాలూర, కోటగిరి, పొతంగల్, వర్ని, చందూర్, మోస్రా, రుద్రూర్, ఎడపల్లి మండలాలు ఉన్నాయి. 9మండలాల పరిధిలో వందలాది పాఠశాలల్లో సుమారు 15వేల మందికి పైగా విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. రెంజల్, నవీపేట ఎంఈవోగా వ్యవహరిస్తున్న గణేష్ రావు ఈ నెలాఖరుకు పదవి విరమణ చేయనున్నారు. నిజామాబాద్, ఆర్మూర్ డివిజన్‌లలో గంగారాజులు, శ్రీనివాస్, స్వామి, వనజలు ఇన్‌చార్జి ఎంఈవోలుగా వ్యవహరిస్తున్నారు. ఇన్‌చార్జిల పాలనతో విద్యావ్యవస్థ గాడితప్పుతోందని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

రుణాల రెన్యూవల్‌కు చర్యలు చేపట్టాలి : కలెక్టర్


మాట్లాడుతున్న కలెక్టర్

కామారెడ్డిటౌన్, సెప్టెంబరు 9: పంట రుణమాఫీ జరిగిన రైతుల వ్యవసాయరుణాలు రెన్యూవల్ విషయంలో అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కామారెడ్డి కలెక్టర్ ఆశీష్‌సంగ్వాన్ అన్నారు. సోమవారం తన కార్యాలయ చాంబర్‌లో బ్యాంకర్లు, వ్యవసాయ తదితర అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని బ్యాంకుల్లో ఏ మేర వ్యవసాయ రుణాలు రెన్యూవల్ జరిగాయి, ఎంతమంది కాకుండా ఉన్నాయో అనే విషయాలపై సమీక్షించాయి. ఎస్‌బీఐ, డీసీసీబీ బ్యాంకుల రెన్యూవల్ శాతం మరింతగా పెంచాలని బ్యాంకర్లను కలెక్టర్ ఆదేశించారు. రుణమాఫీ జరిగిన రైతుల వ్యవసాయరుణాల రెన్యూవల్ యూనియన్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా 83శాతం, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ 81శాతం, కెనరా బ్యాంక్ 70శాతం, ఎస్‌బీఐ 40శాతం, డీసీసీబీ 39శాతం మాత్రమే అభివృద్ధిసాధించాయని పేర్కొన్నారు. సొసైటి వారిగా రుణమాఫీ వివరాలు, పంటరుణాల రెన్యూవల్స్ సమర్పించాలని జిల్లా సహకార అధికారిని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి తిరుమల ప్రసాద్, ఎల్‌డీఎం రవికాంత్, ఎస్‌బీఐ ఏజీఎం చంద్రశేఖర్, డీఎం శాండిల్య, డీసీసీబీ డీజీఎం సుమమాల తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి 114 ఫిర్యాదులు

కామారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 114 ఫిర్యాదులు వచ్చినట్లు కలెక్టర్ ఆశీష్‌సంగ్వాన్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫిర్యాదులలో 56రెవెన్యూశాఖకు సంబంధించి ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, జడ్పీసీఈవో చందర్, డీపీవో శ్రీనివాస్‌రావు, డీఆర్‌డీవో సురేందర్, మసూర్ అహ్మద్ అధికారులు పాల్గొన్నారు.

'రక్తదానం ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడుతుంది'

బోధన్‌రూరల్,సెప్టెంబర్ 9: రక్తదానం ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడుతుందని బీజేపీ జిల్లా కార్యదర్శి మారోజి సుధార్ చారి అన్నారు. సోమవారం బోధన్ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రక్తదానం అత్యవసర సమయంలో ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడుతుందన్నారు. రక్తదానం ప్రాణదానంగా అభివర్ణించారు. బీజేపీ బోధన్ నియోజకవర్గ నాయకులు వడ్డీ మోహన్ రెడ్డి జన్మదిన సందర్భంగా రక్తదాన కార్యక్రమం చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ గోపి కిషన్, కూరేళ్ల శ్రీధర్, కౌన్సిలర్ వినోద్, గౌతం, మనోహర్, గోపి, శ్రీకాంత్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉషోదయ విద్యార్థులకు ఉద్యోగాలు

బోధన్‌రూరల్, సెప్టెంబర్ 9: పట్టణంలోని ఉషోదయ డిగ్రీ కళాశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించడంతో సోమవారం కళాశాల యాజమాన్యం విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ దుశ్యంత్ మాట్లాడుతూ.. డిగ్రీ కళాశాల విద్యార్థులు దేశ్‌పాండే ఫౌండేషన్‌లోని కాకతీయ సాండ్ బాక్స్ ద్వారా శిక్షణ పొంది ప్రముఖ దేశ్‌పాండే ఫౌండేషన్ కార్యాలయంలో నిర్వహించిన ఉద్యోగ నియామకాల్లో ఉద్యోగాలు సాధించారని అభినందించారు. కళాశాలకు చెందిన రాఘవేంద్ర, సాత్విక, హర్షితలు ఉద్యోగాలు సాధించారని పేర్కొన్నారు. ఒక్కొక్కరికి 3లక్షలకు పైగానే వేతనాలు ఉంటాయన్నారు. విద్యార్థులు తమ ఉజ్వల భవిష్యత్‌కై కృషి చేసి ఉద్యోగాలు సాధించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గంగాధర్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో లయన్స్‌క్లబ్ పూజలు

బోధన్‌రూరల్, సెప్టెంబర్ 9: పట్టణంలోని లయన్స్ కంటి ఆసుపత్రి ప్రాంగణంలో గల శివాలయంలో సోమవారం లయన్స్ ప్రతినిధులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలందరు ఆయురారోగ్యాలతో ఉండాలని, పంటలు సమృద్ధిగా పండాలని పూజలు నిర్వహించామన్నారు. వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ ప్రతినిధులు బసవేశ్వర్ రావు, ప్రదీప్ గుప్తా, కిషోర్ కుమార్, వై.శ్రీనివాస్, గుప్తా సెట్, సుబ్బారెడ్డి, తదితరులున్నారు.

బదిలీపై వెళ్లిన హెచ్‌ఎంకు సన్మానం

కోటగిరి,సెప్టెంబర్ 9: మండల కేంద్రంలోని కోటగల్లీ ప్రాథమిక పాఠశాలలో పని చేసి బదిలీపై వెళ్లిన ప్రధానోపాధ్యాయులు వీరేశంను సోమవారం ఉపాధ్యాయులు, గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. 12ఏళ్ల పాటు పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు విధులు నిర్వర్తించి రుద్రూర్ మండలం రాయకూర్‌కు బదిలీ అయ్యారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఉదయ్‌చందర్, గంగారాజు, కనీజ్ ఫాతిమా పాల్గొన్నారు.

బస్సుల సంఖ్యను పెంచాలి

సిరికొండ, సెప్టెంబరు9: గ్రామీణ ప్రాంత ప్రజల కోసం ఆర్టీసీ బస్సుల సంఖ్యను పెంచాలని ప్రగతి శీల మహిళా సంఘం ఆర్మూర్ డివిజన్ అధ్యక్షురాలు పి.రమ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సిరికొండ మండల పరిధిలోని చీమన్‌పల్లి, తాటిపల్లి మీదుగా నడిచే సిరిసిల్ల బస్సులు నిలిపి వేశారని వాటిని పునరుద్ధరించాలని ఆమె ఆర్టీసీ అధికారులకు విజ్ఞప్తి చేశారు. భీమ్‌గల్-కామారెడ్డి మధ్య నడిచే బస్సులు సైతం నిలిచి పోయాయని వాటిని కూడా యథావిధిగా నడిపించాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు లత, లక్ష్మి, మానస పాల్గొన్నారు.

తెలంగాణ విలీనంపై పుస్తకావిష్కరణ

బోధన్‌రూరల్,సెప్టెంబర్ 9: తెలంగాణ విలీనంపై వాస్తవ విషయాలను వివరిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం బోధన్ పట్టణంలో పార్టీ జిల్లా కార్యదర్శి రమేష్ బాబు ఆధ్వర్యంలో తెలంగాణ వాస్తవ విషయాల పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రాన్ని భారత యూనియన్‌లో విలీనం చేయడాన్ని బీజేపీ నాయకులు ఇరువర్గాల మధ్య వక్రీకరణలు చేస్తున్నారని ఇది సరైన పద్ధతి కాదని విమర్శించారు. వాస్తవంగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం కమ్యూనిస్టుల నాయకత్వంలో నిరంకుశానికి, వెట్టి చాకిరికి వ్యతిరేకంగా, కుల, మత, ప్రాంత విభేదానికి వ్యతిరేకంగా, నిజాం నవాబును ఎదిరించడంలో సీపీఎం ఎంతో పోరాటం చేసిందన్నారు. కొంతమంది దీన్ని విలీనం, విమోచనం అని విద్రోహం అని ప్రచారం చేస్తూ ప్రజల త్యాగాన్ని కమ్యూనిస్టుల పోరాటాన్ని తక్కువ చేయడానికి వివిధ పార్టీలు ప్రయత్నిస్తున్నాయన్నారు. వాస్తవాలను వివరించడానికి సీపీఎం ఆధ్వర్యంలో బుక్‌లెట్‌ను విడుదల చేయడం జరిగిందన్నారు. ఈ నెల 15,16, 17తేదిల్లో నిజామాబాద్, బోధన్, ఆర్మూర్ ప్రాంతాలలో సదస్సులు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శంకర్ గౌడ్, ఏశాల గంగాదర్, వెంకటేష్, నన్నేసాబ్, మేకల మల్లేష్, గోపి తదితరులున్నారు.

ఉద్యమమే ఊపిరిగా జీవించిన కాళోజీ

సిరికొండ, సెప్టెంబరు 9: ఉద్యమమే ఊపిరిగా జీవించిన గొప్ప ప్రజాకవి కాళోజీ నారాయణరావు అని సత్యశోధక్ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడే నర్సయ్య అన్నారు. కాళోజీ 110వ జయంతి సందర్భంగా మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన వంతుగా ప్రజలను చైతన్యం చేయడానికి తన రచనలను కొసాగించారని కాళోజీ సేవలను నర్సయ్య కొనియాడారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పోచారం, ఆగ్రోస్ కాసుల

గురువుచూపిన బాటలో నడుచుకోవాలి

● ప్రభుత్వ వ్యవసాయ సలహాదారుడు పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ, సెప్టెంబరు 9: గురువే ప్రత్యక్ష దైవమని గురువు చూపిన బాటలో నడుచుకుంటే సన్మార్గం లభిస్తుందని ప్రభుత్వ వ్యవసాయ సలహాదారుడు పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం బాన్సువాడ పట్టణంలోని రెడ్డి సంఘంలో ఏర్పాటు చేసిన ఉత్తమ ఉపాధ్యాయుల పురస్కారం 2024 కార్యక్రమానికి రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌తో కలిసి పోచారం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. బాన్సువాడ, బీర్కూర్, నసురుల్లాబాద్ మండలాలకు చెందిన ఉత్తమ ఉపాధ్యాయులను పూలమాలతో సత్కరించి ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పోచారం మాట్లాడుతూ.. నేటి సమాజంలో విద్యార్థులు గురువులు చెప్పిన పాఠాలు విని వారు చూపిన బాటలో నడుచుకోవాలని అప్పుడే భవిష్యత్తులో సన్మార్గం ఉత్తమ ఫలితాలు ఉన్నత స్థానంలో గుర్తింపు పొందుతారని ఆయన తెలిపారు. అనంతరం ఉపాధ్యాయులు ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో నాగేశ్వర్‌రావు, పీఆర్‌టీయూ జిల్లా కార్యదర్శి కుశాల్, నాయకులు కృష్ణారెడ్డి, నార్ల సురేష్, ఎజాజ్, కాలేక్ పాల్గొన్నారు.

ముంపు పంటలను పరిశీలించిన ఏడీఏ

నాగిరెడ్డిపేట, సెప్టెంబరు 9: సింగూరు ప్రాజెక్టు నీటి విడుదల కారణంగా మంజీరా నది ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో నిజాంసాగర్ బ్యాక్ వాటర్ వల్ల మండలంలో ముంపుకు గురైన వరి పంట పొలాలను సోమవారం ఎల్లారెడ్డి ఏడీఏ లక్ష్మీ ప్రసన్న పరిశీలించారు. ఆమె నాగిరెడ్డిపేట, చీనూర్, వాడి గ్రామ శివారులో ముంపుకు గురవుతున్న వరి పంట పొలాలను పరిశీలించారు. పలువురు రైతులతో మాట్లాడి పంటలు ముంపుకు గురవుతున్న విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిజాంసాగర్ బ్యాక్ వాటర్ వల్ల మండలంలో మంజీరా పరివాహక ప్రాంతంలో పంటలు ముంపుకు గురవుతున్న విషయాన్ని నిజాంసాగర్ నీటిపారుదల శాఖ ఏఈ శివప్రసాద్‌తో ఫోన్‌లో మాట్లాడి సమస్యను వివరించారు. ప్రాజెక్టులు గేట్లు మరిన్ని ఎత్తి మండలంలో పంటలు ముంపుకు గురి కాకుండా చూడాలని ఆమె కోరారు. ఏడీఏ వెంట స్థానిక ఏవో హరి, వెంకట ప్రసాద్ ఉన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన పెంచుకోవాలి



గిరిరాజ్ కళాశాలలో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పెద్దబజార్, సెప్టెంబరు 9: విద్యార్థులందరూ ఎయిడ్స్ పట్ల అవగాహన పెంచుకోవాలని అడిషనల్ జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ దేవి నాగేశ్వరి అన్నారు. సోమవారం నగరంలోని దుబ్బలోగల గిరిరాజ్ కళాశాలలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా 2కె రెడ్ రన్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈకార్యక్రమంలో విద్యార్థులకు 2కె రన్ తర్వాత మెమోంటోలతో పాటు సర్టిఫికెట్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రఫీక్, జిల్లా టీబీ కోఆర్డినేటర్ రవిగౌడ్, కళాశాల డైరెక్టర్ బాలమణి, మహేష్, స్రవంతి, లక్ష్మి, దేవేందర్, గౌతమి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలను జయప్రదం చేయాలి

కోటగిరి,సెప్టెంబరు 9: కోటగిరి మండల కేంద్రంలో ఈ నెల 11వ తేదీన నిర్వహించనున్న తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలను జయప్రదం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి విఠల్ గౌడ్ కోరారు. కోటగిరి మండల కేంద్రంలో సోమవారం సీపీఐ కార్యకర్తల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి, భుక్తి కోసం మాతృ భూమి విముక్తి కోసం జరిగిన పోరాటంలో అనేక మంది సీపీఐ కార్యకర్తలు ప్రాణత్యాగం చేశారన్నారు. వారి పోరాట ఫలితమే తెలంగాణ రాష్ట్రంలో 10లక్షల ఎకరాల భూపంపిణీ కార్యక్రమం జరిగిందన్నారు. పోరాట వీరులను స్మరిస్తూ ఈ నెల 11వ తేదిన తలపెట్టిన వారోత్సవ సభను జయప్రదం చేయాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు గంగాధర్, శివరాజ్, సాయిలు, హన్మాండ్లు, భరత్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి అంతర్ పాఠశాల పోటీలు ప్రారంభం

ముప్కాల్, సెప్టెంబరు9: బాల్కొండ ఉమ్మడి మండలం బాల్కొండ, ముప్కాల్, మెండోర మండలాల ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల క్రీడాకారులచే అంతర్ పాఠశాల పోటీలను నేటి నుంచి నిర్వహించనున్నట్టు ఎంఈవో బట్టు రాజేశ్వర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అంతర్ పాఠశాల పోటీలను ప్రారంభించనున్నారు. ఈనెల 10 నుంచి 12వ తేదీ వరకు అంతర్ పాఠశాల పోటీలు జరుగుతాయని, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో పోటీలలో అండర్-14 జూనియర్ బాలురు, బాలికల జట్లు తలపడనున్నాయని, ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు బహుమతులు ప్రధానం చేస్తారని అయన తెలిపారు.

నవీపేటలో దొంగతనం

నవీపేట,సెప్టెంబరు 9: నవీపేటలోని సుభాష్‌నగర్ కాలనీకి చెందిన రావుల సాయిలు ఇంట్లో సోమవారం తెల్లవారుజామున దొంగతనం జరిగింది. ఎస్ఐ వినయ్ తెలిపిన ప్రకారం రావుల సాయిలు అనే యువకుడు రెండున్నర సంవత్సరాల క్రితం ఉపాధి నిమిత్తం దుబాయ్ వెళ్లాడు. ఆదివారం సాయంత్రం దుబాయ్ నుంచి సాయిలు తన స్వగ్రామానికి వచ్చాడు. రాత్రి భోజనాల అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి తన పూరి గుడిసెలో వారు నిద్రించారు. గుర్తు తెలియని దొంగ సోమవారం తెల్లవారుజామున సుమారు 3:30గంటల సమయంలో ఇంటి లోపలికి ప్రవేశించి లోపల ఉన్న రెడ్‌మీ ఫోన్, 20తులాల వెండి పట్ట గొలుసులు, ఫ్లైయిట్ టికెట్, వీసా, దుబాయ్ ఏటీఎంతో పాటు పర్సులో ఉన్న రూ.5వేల నగదును ఎత్తుకెళ్లాడు. ఈ విషయంపై సోమవారం బాధితుడు సాయిలు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

టీపీసీసీ చీఫ్‌ను కలిసిన పలువురు కాంగ్రెస్ నాయకులు



సుదర్శన్‌రెడ్డిని కలిసిన మహేష్‌గౌడ్



మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసిన గడుగు గంగాధర్, ఇతర నేతలు

నిజామాబాద్ అర్బన్, సెప్టెంబరు 9: టీపీసీసీ అధ్యక్షుడిగా నియమితులైన మహేష్‌కుమార్‌గౌడ్‌ను సోమవారం రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్ ఆయన నివాసంలో మర్యాధపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఎన్ఎస్‌యూఐ నుంచి ఎదిగి రాష్ట్ర కాంగ్రెస్ అత్యుత్తమ స్థానమైన టీపీసీసీ అధ్యక్షుడు కావడం జిల్లాకే గర్వకారణం అని గడుగు గంగాధర్ అన్నారు. ఆయనతో పాటు నరాల రత్నాకర్, సుభాష్ జాదవ్, వినయ్, చందు, తదితరులు మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసిన వారిలో ఉన్నారు. ఫోటో నంబరు

ధర్పల్లి: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా నియమితులైన మహేష్‌కుమార్‌గౌడ్‌ను ధర్పల్లి కాంగ్రెస్ నాయకులు కలిశారు. సోమవారం హైదరాబాద్‌లోగల మహేష్‌కుమార్‌గౌడ్ నివాసంలో ఆయనను కలిసి శాలువ, పుష్పగుచ్ఛంతో సన్మానించారు. జిల్లాకు చెందిన మహేష్‌కుమార్‌గౌడ్‌కు టీపీసీసీ అధ్యక్ష పదవి దక్కడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జి.మనోహర్‌రెడ్డి, అధికార ప్రతినిధి చెలిమెల నర్సయ్య, మాజీ సర్పంచ్ మిట్టపల్లి గంగారెడ్డి, పుప్పాల సుభాష్, రమేష్ గౌడ్, దాసు, తదితరులు ఉన్నారు.

సుదర్శన్‌రెడ్డిని మర్యాధపూర్వకంగా కలిసిన మహేష్‌కుమార్‌గౌడ్

నిజామాబాద్ అర్బన్, సెప్టెంబరు 9: రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా నియామకమైన మహేష్‌కుమార్‌గౌడ్ సోమవారం హైదరాబాద్‌లోని మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిని మర్యాధపూర్వకంగా కలిశారు. టిపిసిసి అధ్యక్షుడిగా నియమితులైన ఆయన సీఎంతో పాటు డిప్యూటీ సీఎం, మంత్రులు, ఇతర ముఖ్యనేతలను మర్యాధపూర్వకంగా కలుస్తున్నారు.



టీపీసీసీ అధ్యక్షుడిని సన్మానిస్తున్న ధర్పల్లి కాంగ్రెస్ నాయకులు

ఈమేరకు సోమవారం మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయనతో పాటు ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, టిపిసిసి ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్, ఏబి శ్రీనివాస్,ముత్యంరెడ్డి, సాయిమెస్ శ్రీనివాస్ ఉన్నారు.

భీమ్‌గల్: టీపీసీసీ అధ్యక్షుడిగా నియామితులైన మహేష్‌కు మార్‌గౌడ్‌ను భీమగల్ కాంగ్రెస్ నాయకులు సోమవారం హైదరాబాదలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మహేష్‌కుమార్‌గౌడ్‌ను కాంగ్రెస్ నాయకులు డైడి సురేష్, మహమ్మద్ అబ్దుల్, జుబైర్, సయ్యద్ నవీద, బాయ్, జిషన్, అద్నాన్, తదితరులు శాలువతో సన్మానించారు.

'పట్టణ అభివృద్ధికి సహకరించండి'



సబ్ కలెక్టర్‌ను కలిసిన మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిలర్‌లు

బోధన్‌రూరల్,సెప్టెంబరు 9: బోధన్ సబ్ కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన వికాస్ మహతోను సోమవారం బోధన్ మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మ శరత్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బోధన్ పట్టణ పరిస్థితుల గురించి ఆయనతో మాట్లాడారు. బోధన్ పట్టణ అభివృద్ధికి అన్ని రకాలుగా సహకరించాలన్నారు. చైర్‌పర్సన్‌తో పాటు కౌన్సిలర్‌లు శరత్ రెడ్డి, డబ్బు, ఇమ్రాన్‌లతో తదితరులున్నారు.

● ప్రైవేట్ స్కూల్ అండ్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో

బోధన్ సబ్ కలెక్టర్‌ను సోమవారం బోధన్ ప్రైవేట్ స్కూల్ అండ్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ వికాస్ మహతో, పట్టణ సీఐ వెంకట్ నారాయణను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ కార్యక్రమంలో ప్రైవేటు పాఠశాలల, కళాశాలల అధ్యక్షుడు హరి, రాజు, చక్రవర్తి, సురేష్, రాధాకృష్ణ, కొడాలి కిషోర్ కుమార్, వైశ్రీనివాస్, చిరంజీవిలతో పాఠశాలల, కళాశాలల యాజమాన్యాలు తదితరులున్నారు.

నలిమెల భాస్కర్‌కు పురస్కారం పట్ల హర్షం

భీమ్‌గల్, సెప్టెంబరు9: తెలంగాణ రచయితల సంఘం జాతీయ అధ్యక్షుడు నలిమెల భాస్కర్‌కు కాళోజీ పురస్కారం రావడం హర్షనీయమని కోరని గోపరాజు సాహిత్య సాంస్కృతిక సంస్థ వ్యవస్థాపకుడు కంకణాల రాజేశ్వర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండంలోని నారాయణపూర్ గ్రామానికి చెందిన ప్రముఖ కవి రచయిత కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహిత 14బాషల్లో పట్టం కలిగిన బహుబాష కోవిదుడు. తెలంగాణ రచయిత సంఘం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ నలిమెల భాస్కర్ తెలుగు బాషా ప్రావీణ్యానికి చేసిన కృషి ఎనలేనిదని దీనిని గుర్తించి ప్రతీ సంవత్సరం సెప్టెంబర్ 9న కాళోజీ పురస్కరించుకొని నిర్వహిస్తున్న తెలుగుబాష దినోత్సవం సందర్భంగా 2015నుంచి అందజేస్తున్న పురస్కారం ఈ సంవత్సరం డాక్టర్ నలిమెల బాస్కర్‌కు అందజేయడం పట్ల రాజేశ్వర్ అభినందనీయని తెలిపారు.

ఆలూర్‌లో సొసైటీ మహాజన సభ

ఆర్మూర్‌రూరల్, సెప్టెంబరు9: ఆర్మూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ కేంద్రంలో చైర్మన్ తంబురి శ్రీనివాస్ అధ్యక్షతన సోమవారం అర్థ మహాజ సభ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆదాయ వ్యాయ నివేదికను సీఈవో మల్లేష్ చదివి వినిపించారు. అదేవిధంగా సెప్టెంబరు నెల నుంచి మార్చి 2025వరకు అంచనా బడ్జెట్‌ను సమావేశంలో ఆమోదించారు. ఈ సమావేశంలో క్లస్టర్ అధికారి బాపురావు, వైస్‌చైర్మన్ చేపూర్ రాజేశ్వర్, డైరెక్టర్‌లు కల్లెం బోజారెడ్డి, గోవర్ధన్, కల్లెం సాయిరెడ్డి, భాను, సంతోష్‌రెడ్డి, ప్రమోద్‌కుమార్, ఆరే రాజేశ్వర్, మల్లుబాయి, కట్ట నర్సయ్య, గంగాధర్, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

గణేష్ నిమజ్జనాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

● మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మాశరత్‌రెడ్డి



బోధన్‌లో పసుపు వాగును పరిశీలిస్తున్న చైర్‌పర్సన్

బోధన్‌టౌన్,సెప్టెంబర్ 9: బోధన్‌లో గణేష్ నిమజ్జన ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని బోధన్ మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మ శరత్ రెడ్డి అన్నారు. సోమవారం బోధన్ పట్టణంలోని పసుపు వాగు వద్ద గణేష్ నిమజ్జన ప్రదేశాలను పరిశీలించారు. నిమజ్జనానికి కావాల్సిన ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. ఆమె వెంట కౌన్సిలర్‌లు శరత్ రెడ్డి, డబ్బు, ఇమ్రాన్, మున్సిపల్ అధికారులు శ్రీనివాస్, సంబంధిత శాఖ అధికారులు తదితరులున్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

● తహసీల్దార్‌కు వినతి

మోపాల్, సెప్టెంబరు 9: మండలంలో ఉన్న అర్హులైన నిరుపేదలకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథ ఆధ్వర్యంలో సోమవారం మోపాల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐఎంఎల్ నిజామాబాద్ డివిజన్ సహాయ కార్యదర్శి సాయాగౌడ్ మాట్లాడుతూ మండలంలోని సిర్పూర్, సింగంపల్లి, కంజర్ గ్రామాల్లో నిరుపేదలు ఉన్నారని వీరికి ఇండ్ల స్థలాలు ఇవ్వాలని గతంలో అనేక సార్లు అధికారులకు విన్నపాలు సమర్పించడం జరిగిందని అన్నారు. ఇప్పటి వరకు అర్హులైన నిరుపేదలకు ఇండ్ల స్థలాలు ఇవ్వడంలో అధికారులు, ఆటు పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. 2023 సంవత్సరంలో ఆగమేఘాల మీద పేదలకు ప్రొసిడింగ్‌లు ఇచ్చారే తప్ప మరొకటి లేదని అన్నారు. ఇప్పటి వరకు సింగంపల్లి, కంజర్, సిర్పూర్ గ్రామాల్లో అనేక సంవత్సరాల నుంచి నివాసం ఉంటున్నారని ఇప్పటి వరకు పాలకులు వీరికి పట్టాలు ఇవ్వలేకపోతున్నారని అన్నారు. సిర్పూర్ గ్రామంలో 13 సంవత్సరాల నుండి ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్న వారికి ఇప్పటి వరకు కూడా ఇండ్ల పట్టాలు ఇవ్వలేకపోవడంపై మండిపడ్డారు. వీరందరికి వెంటనే ఇండ్ల స్థలాలు ఇచ్చి ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వం 10లక్షల రూపాయల ఆర్థిక సహాయాన్ని చేయాలని డిమాండ్ చేశారు. చాలీ చాలని వేతనాలతో జీవిస్తున్న ప్రజలకు మౌలిక సదుపాయాలు అందించాలని కోరారు. అనంతరం తహశీల్దార్ రామేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో దండు గంగమల్లు, మంగల్‌పాడ్ నారాయణ, ఎర్రన్న, డప్పు గంగాధర్, మహేష్, అమూల్య, లలిత, గణేష్, ఆయా గ్రామాల మహిళలు ఉన్నారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైంది

జక్రాన్‌పల్లి, సెప్టెంబరు9: ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందని, ఉపాధ్యాయులు వృత్తి ధర్మాన్ని నెరవేర్చి విద్యరంలో విద్యార్థులకు చక్కగా బోధించి ఉన్నత స్థాయిలో నిలబెట్టినప్పుడే ఉపాధ్యాయులకు గుర్తింపు లభిస్తుందని అధికారులు అన్నారు. సోమవారం జక్రాన్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం మండలంలోని వివిధ గ్రామాల పాఠశాల లకు చెందిన 20మంది ఉత్తమ ఉపాధ్యాయులను తహసీల్దార్ కిర ణ్మాయి, ఎంపీడీవో సతీష్‌కుమార్, ఎంఈవో శ్రీనివాస్‌లు కలిసి శా లువ, మెమోంటో, పూలమాలలతో సత్కరించారు. అనంతరం ఉపాధ్యా యులు తమ వృత్తిధర్మాన్ని నెరవేర్చి విద్యార్థులకు చక్కగా బోధించి నప్పుడే ఉపాధ్యాయులకు గుర్తింపు లభిస్తుందని అధికారులు అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, పీఆర్‌టీయు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

'పేకాట ఆడితే కఠిన చర్యలు'

బోధన్‌రూరల్, సెప్టెంబర్ 9: పేకాట ఆడితే కఠిన చర్యలు తప్పవని బోధన్ రూరల్ ఎస్ఐ మచ్చేందర్ రెడ్డి అన్నారు. సోమవారం బోధన్ మండలంలోని భవానీపేట్ గ్రామంలో పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి వద్ద నుండి 8100రూపాయలు స్వాధీనం చేసుకున్నామన్నారు. బోధన్, సాలూర మండలాల్లో పేకాట ఆడిన, నిర్వహించిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

గోదావరిలో గల్లంతైన ఫిరోజ్ మృతదేహం లభ్యం

మెండోర, సెప్టెంబరు 9: ప్రాజెక్టు అందాలను తిలకించడానికి వచ్చి గోదావరిలో గల్లంతైన ముంబైకి చెందిన ఫిరోజ్ (28) మృతదేహం లభ్యమైనట్టు ఎస్సై నారాయణ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం మృతుడు కోరుట్లలో బంధువుల ఇంటికి వచ్చి మిత్రులతో కలిసి ప్రాజెక్టు వరద గేట్ల వద్ద నీటిలో సరదాగా ఆడేటప్పుడు నీటి ప్రవాహనికి గల్లంతయ్యాడు. మృతదేహం సోమవారం గాలించగా ప్రాజెక్టు సమీపంలో మృతదేహం లభ్యం అయినట్టు తెలిపారు. ఫిరోజ్ మృతదేహాన్ని చూసి బంధువులు మిత్రులు కన్నీటి పర్యంతమయ్యారు.

శివలింగం చోరీ

జక్రాన్‌పల్లి, సెప్టెంబరు 9: మండలంలోని మునిపల్లి గ్రామంలో గల బీసీ కాలనీలో 63వ జాతీయరహదారి పక్కన సాయిబాబా ఆలయం వెనుకల ప్రతిష్ఠించిన శివలింగాన్ని సోమవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు చోరీ చేసి ఎత్తుకెళ్ళారని ఎస్సై సిహెచ్.తిరుపతి తెలిపారు. సాయిబాబా ఆలయం వెనుక ప్రాంతంలో శివాలయం నిర్మించేందుకు శివలింగాన్ని ప్రతిష్ఠించారు. రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు శివలింగాన్ని చోరీ చేసి తీసుకువెళ్ళారా, ఎవరైన అక్కడ నుంచి తీశారా అనే విషయంపై కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

బోధన్‌రూరల్, సెప్టెంబర్ 9: సాలూర మండల కేంద్రంలోని సాయినగర్ కాలనీలో ఇటీవల పోతుగంటి వీరయ్య నివాసంలో రాత్రి సమయంలో గ్యాస్ సిలిండర్ పేలడంతో వారి నివాసం పూర్తిగా దగ్ధమై, సర్వం కోల్పోవడం జరిగిందని సాలూర సొసైటీ చైర్మన్ అల్లె జనార్ధన్ అన్నారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ తరపున 25వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని ఎమ్మెల్యే ఆదేశాల మేరకు అందజేశామన్నారు. గ్యాస్ సిలిండర్ పేలుడు ప్రమాదంలో చాకలి సురేష్ అనే వ్యక్తికి గాయాలవ్వడంతో అతనిని పరామర్శించామన్నారు. గాయపడిన వ్యక్తికి మెరుగైన వైద్యంతో పాటు ఎమ్మెల్యే సహకారంతో ఇందిరమ్మ ఇల్లు ఇప్పించడం జరుగుతుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ భూమయ్య, వైస్ చైర్మన్ సందీప్ రెడ్డి, డైరెక్టర్‌లు ఓట్లప్ప, సంగెపు భూమయ్య, రామకృష్ణ, బచ్చు సాయిలు, లింబయ్య, సురేష్ పటేల్, లోకపు లక్ష్మణ్, మైదపు నాగరాజు, స్వామి గౌడ్, సొక్కం రవి, బుద్దె లక్ష్మణ్, రావుల లక్ష్మణ్, సొక్కం గౌడ్, మైదపు నాగరాజు, చాకలి లక్ష్మణ్, బ్రాహ్మరెడ్డి, మోహన్ తదితరులున్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేత

భీమ్‌గల్, సెప్టెంబరు9: పట్టణ కేంద్రంలోని బోయిగల్లీలో గల ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు బ్యాంక్ ఆఫ్ బరోడా ఆర్మూర్ బ్రాంచ్ మేనేజర్ రమ్య ఆధ్వర్యంలో సోమవారం నోట్‌బుక్స్, పెన్నులను వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ విద్యార్థులు చిన్నప్పటి నుంచి కష్టపడి చదివి జీవితంలో ఉన్నత స్థానంలో స్థిరపడి కన్న తల్లిదండ్రులకు చదువు చెప్పిన గురువులకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సత్యరమేష్, ఉపాధ్యాయులు, రవీందర్, అశోక్, మహేష్, బ్యాంకు సిబ్బంది, రజనీకాంత్, దినకర్‌లు ఉన్నారు.

విద్యార్థులకు ఫిజియోథెరపీ పరీక్షలు

జక్రాన్‌పల్లి, సెప్టెంబరు 9: జక్రాన్‌పల్లి మండల కేంద్రంలోని శుభోదయం పాఠశాలలో సోమవారం మానసిక దివ్యంగ విద్యార్థులకు ఫిజియోథెరపిస్టు డాక్టర్ స్వప్న ఫిజియోథెరపీ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో శ్రీనివాస్ మాట్లాడుతూ మానసిక విద్యార్థుల తలిదండ్రులు ఫిజియోథెరపీ పరీక్షలు చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ శ్రీకాంత్; స్వామి, పద్మజా, రాము, తదితరులు పాల్గొన్నారు.

● మండపాల వద్ద సందడి...



తాళ్లరాంపూర్‌లో అన్నదానం చేస్తున్న భక్తులు



నగరంలో గణేష్ మండపాన్ని సందర్శించిన బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

బెహరాన్‌లో ఘనంగా వినాయక చవితి

కమ్మర్‌పల్లి, సెప్టెంబరు 9: ఉపాదినిమిత్తం బేహరాన్‌లో పనిచేస్తున్న నిజామాబాద్, జగిత్యాల, కరీంనగర్ జిల్లా తెలుగువారు శనివారం వినాయక చవితి పర్వదినాన్ని భక్తిశ్రద్దలతో ఘనం జరుపుకున్నారు. ఈ సందర్భంగా అక్కడున్న ఇస్మాయిల్ కంపెని యాజమాన్యం సహకారంతో అస్కర్ లేబర్ క్యాంప్‌లో కొవ్వూరి శ్రీనివాస్, ఈశ్వర్‌రావు బ్రదర్స్ అధ్వర్యంలో వినాయక ప్రతిమను ప్రతిష్ఠంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 2006 నుండి గత 19 సంవత్సరాలుగా ప్రతి సంవత్సరం వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠించి నవరాత్రి పూజలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్మికులు పాల్గొన్నారు

మెండోర: మండలంలోని మెండోర, సావెల్, బుస్సాపూర్, కోడిచర్ల, వెల్కటూర్, చాకిర్యాల్, దూదిగాం, పోచంపాడ్ గ్రామాల్లోని మండపాల వద్ద గణపతికి ప్రత్యేక పూజలు చేశారు. గణపతికి నైవేద్యాలు సమర్పించి కుటుంబసభ్యులందరు ఆయురారోగ్యాలతో సల్లంగా ఉండాలని వేడుకున్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని గురడిరెడ్డి ఆధ్వర్యంలో పోచంపాడ్ బస్టాండ్ సెంటర్‌లో అన్నదానం నిర్వహించారు.

భీమ్‌గల్: పట్టణ కేంద్రంలోని ట్రైల్స్ యూనియన్ ఆధ్వర్యంలో మినీ ట్యాంకు బండ్‌పైన గణపతి మందిరంలో సోమవారం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిన్న రాజన్న, కర్నె చిన్న రాజన్న, ఆకుల హరిష్, రాము, బందెల చిన్న నర్సయ్య, కొత్తల అంజయ్య, సిద్దపల్లి శంకర్, కర్నె నవీన్, నీలం గంగాధర్, సోను, నరేష, సుఖరాం, రామ్, బచ్చన్, రాజ్‌కుమార్; కర్నె పెద్ద రాజన్న, సభ్యులు పాల్గొన్నారు.

నవీపేట: మండలంలోని నాళేశ్వర్‌లో సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక లయన్స్ యూత్ గణేష్ మండలి వద్ద ఈ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రవీణ్, శేఖర్, రమేష్, ప్రతాప్, తదితరులున్నారు.

డిచ్‌పల్లి : తెలంగాణ వర్సిటీ పీజీ బాయ్స్ హాస్టల్‌లో మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంటకు వర్సిటీ క్రీడాప్రాంగణంలో ఉత్సవకమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కమిటీ అధ్యక్షుడు నవీన్ తెలిపారు. అన్నదాన కార్యక్రమానికి పెద్దసంఖ్యలో విద్యార్థులు హాజరు కావాలని అనిల్, అమృత్ చారి, శివా, తెలిపారు. ఓల్డ్ బాయ్స్ హాస్టల్ వద్ద ప్రతిష్ఠించిన వినాయకుడి విగ్రహంవద్ద ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు బీజేవైఎం జిల్లా ప్రతినిధి పిల్లి శ్రీకాంత్, వర్సిటీ విద్యార్థులు తెలిపారు.

ఉత్తమ ప్రిన్సిపాల్‌కు సన్మానం

మోర్తాడ్, సెప్టెంబరు 9: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.పెద్దన్న రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపికయ్యారు. సోమవారం కాళోజీలో లెక్చరర్‌లు, విద్యార్థులు అభినందన సభ ఏర్పాటు చేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా లెక్చరర్‌లు మాట్లాడుతూ డిగ్రీ కళాశాలను ఎంతో అభివృద్ధి చేశారని ప్రిన్సిపాల్ డాక్టర్ పెద్దన్న ను కొనియాడారు. ప్రిన్సిపాల్ పెద్దన్న మాట్లాడుతూ తనను అభినందించిన లెక్చరర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో లెక్చరర్‌లు రవీందర్, భూపతి, దశరథ్, రాజన్న, అవంతి, అర్చన, పద్మ, అశోక్, విద్యార్థులు పాల్గొన్నారు.

బీసీల సదస్సు కరపత్రాల ఆవిష్కరణ

ఆర్మూర్‌టౌన్, సెప్టెంబరు9: పట్టణంలోని బార్ అసోసియేషన్ భవనంలో సోమవారం బీసీల సదస్సు కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీసీ జనసభ అధ్యక్షుడు రాజారాంయాదవ్ మాట్లాడుతూ నేడు ఆర్మూర్‌లోని ఎంఆర్‌గార్డెన్‌లో జరిగే బీసీల సదస్సును విజయవంతం చేయాలని సమగ్ర కుల జనగణన, స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ సాధన కోసం ప్రతీఒక్క బీసీ సదస్సుకు హాజరై విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పార్లమెంట్ ఇన్‌చార్జీ దేగాం యాదాగౌడ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తెడ్డు నర్సయ్య, న్యాయవాదులు చిల్క కిష్టయ్య, ప్రవీన్, అజిద్, రాములు, రాకేష్, మోహన్, సుబాష్, గణేష్, శ్రావణ్, కిరణ్, సంజీవ్, తదితరులు పాల్గొన్నారు.

సిద్దులగుట్టపై ఘనంగా పల్లకీ సేవ

పెర్కిట్, సెప్టెంబరు9: ఆర్మూర్ పట్టణంలో నవనాథ సిద్దులగుట్టపై ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా పల్లకి సేవ నిర్వహించారు. గుట్టపై గల శివాలయం, దుర్గామాత, రామాలయం, దత్తాత్రేయ, అయ్యప్ప, ఎల్లమ్మతల్లి, ఏకశిల స్తంభం వద్ద గల హన్మాన్ ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నందీశ్వర మహరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పల్లకీసేవలో ఆర్మూర్ భజన మండలి సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి నృత్యాలు చేస్తూ భక్తిగీతలు పాడారు. గుట్టపైకి విచ్చేసిన భక్తులందరి సహయ సహకారాలతో కొనసాగుతున్న అన్నప్రసాద కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పీసీ.గంగారెడ్డి, కొడిగెల మల్లయ్య, పొద్దుటూరి చరణ్ రెడ్డి, బోండ్ల ఆనంద్, ప్రశాంత్‌గౌడ్, రవి, చెందేసి శ్రీనివాస్, కొంతం మురళీ, అజారి సతీష్, అలిశెట్టి నరేష్, రామాగౌడ్, సిద్దులగుట్ట సేవ సమితి సభ్యులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన బోధన్ ఎమ్మెల్యే

మోర్తాడ్, సెప్టెంబరు 9: మండలంలోని ధర్మోరా గ్రామంలో ఇటీవల మరణించిన ముస్కు భూమారెడ్డి కుమారులను కుటుంబసభ్యులను మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి పరమార్శించారు. సోమవారం సాయంత్రం భూమారెడ్డి కుమారులు ముసుక్కరాజేందర్ రెడ్డి, ముస్కురమేష్ రెడ్డిలను బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్ రెడి పరమార్శించి సంతాపం తెలియజేశారు. ఆయన వెంట స్థానిక కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు ఉన్నారు.

'సంప్రదాయాలను పాటించాలి'

కమ్మర్‌పల్లి, సెప్టెంబరు 9: కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో ప్రతిష్ఠించిన వినాయక మండపాల వద్ద హిందూ సంస్కృతి సంప్రదాయబద్ధం నవరాత్రి ఉత్సవాలు జరుపుకోవాలని హిందు ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది. వినాయక నిమజ్జనం రోజున శోభా యాత్ర ప్రారంభమవుతుందో అదేరోజు రాత్రి 12 గంటల వరకు నిమజ్జనం పూర్తి చేయియాలని, లేని పక్షంలో గ్రామాభివృద్ధి కమిటీ, స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో పూర్తిచేయించడం జరుగుతుందన్నారు. ప్రతీ వినాయక మండపాలవద్ద 11 రోజులలోపు ఉత్సవాలు పూర్తి చేయాలని మండపాలవద్ద నిర్వాహకులకు నిబంధనలతో కూడిన వినతిపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో హిందూ ధర్మ పరిరక్షణ సభ్యులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

ఆర్మూర్‌రూరల్, సెప్టెంబరు 9: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల ప్రిన్సిపాల్ పూర్ణచందర్ అన్నారు. సోమవారం ఆర్మూర్‌లోని గురుకుల బాలుర పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించిన సాఫ్ట్‌బాల్ బాలుర పోటీలకు జిల్లా బాలుర జట్టును నిర్వహించారు. ఎంపిక పోటీలకు హాజరైన క్రీడాకారుల నుంచి ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లా ప్రాబ బుల్స్ జట్టుకు ఎంపిక చేసినట్టు జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ప్రభాకర్‌రెడ్డి, గంగామోహన్‌లు తెలిపారు. జిల్లా జట్లకు ఎంపికైన క్రీడాకారులు ఈనెల 13వ తేదీ నుంచి సిరిసిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సాయన్న, యోగేశ్వర్ దయాల్, సాఫ్ట్‌బాల్ కోచ్ సంతోష్, నరేష్, పీడీజ్ఞానేశ్వర్, గంగాదర్, రాజేందర్, పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు పరిశీలిచిన ఎంపీడీవో

భీమ్‌గల్‌రూరల్, సెప్టెంబరు9: మండలంలోని బాబాపూర్ గ్రామంలో జరుగుతున్న పారిశుధ్య పనులను సోమవారం ఎంపీడీవో సంతోష్ కుమార్ పరిశీలించారు. డ్రైడేలో భాగంగా గ్రామాన్ని సందర్శించి మురుగుకాలువల్లో నిండిపోయిన చెత్తను తొలగించాలని సీజనల్ వ్యాధులు బారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని కార్య దర్శికి సూచించారు. ఇంటి చుట్టుపక్కల, కుండిల్లో, టైర్‌లలో నీరు నిల్వ లేకుండాచూసుకోవాలని దోమలు వ్యాప్తి చెంది రోగాల బారిన పడే అవకాశం ఉందని తెలిపారు. ఆయన వెంట కార్యదర్శి జితేందర్, కారో బార్ గుర్రపు రాజేశ్వర్, మాజీ ఎంపీటీసీ సురద్దీల్అదిక్ ఉన్నారు.

బ్రాహ్మణ్‌పల్లి సింగిల్ విండో చైర్మన్‌గా నర్సారెడ్డి

జక్రాన్‌పల్లి, సెప్టెంబరు 9: మండలంలోని బ్రాహ్మణ్‌పల్లి సింగిల్‌విండో చైర్మన్‌గా తొర్లికొండకు చెందిన కాటిపల్లి నర్సారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం బ్రాహ్మణ్‌పల్లి విండో కార్యాలయం విండో చైర్మన్‌గా కాటిపల్లి నర్సారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇదివరకు విండో చైర్మన్‌గా ఉన్న అన్వేష్‌రెడ్డి వ్యక్తిగత కారణాల వల్ల చైర్మన్ పదవికి రాజీనామా చేశారు. అనంతరం విండో పాలకవర్గాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు సన్మానించారు. విండో చైర్మన్ ఎన్నికకు సహకరించిన నిజామాబాద్‌రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డికి కాటిపల్లి నర్సారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో విండో వైస్‌చైర్మన్ భైరి లక్ష్మణ్, సింగిల్ విండో చైర్మన్‌లు ఎం.సాయిరెడ్డి, ఆర్మూర్ గంగారెడ్డి, మాజీసర్పంచ్‌లు ఎం.చిన్న సాయిరెడ్డి, నర్సారెడ్డి, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, రవి, సంజయ్, వినోద్, గంగారెడ్డి, మల్లేష్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక

ఆర్మూర్‌రూరల్, సెప్టెంబరు9: పట్టణంలోని విజయ్ హైస్కూల్‌లో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే బాల్‌బ్యాడ్మింటన్ బాలబాలికల జిల్లా జట్టు ఎంపిక చేశారు. ఎంపిక పోటీలకు కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల నుంచి 50 మంది బాలురు, 40 మంది బాలికలు ఎంపిక పోటీలు హాజరుకాగా, ప్రతిభ చూపిన క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపిక చేసినట్టు బ్యాడ్మింటన్ జిల్లా అధ్యక్షుడు మానస గణేష్, ప్రధా నకార్యదర్శి బి.శ్యామ్ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులకు శిక్షణ శిబిరం నిర్వహిస్తామన్నారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను తుది జట్టుకు ఎంపిక చేస్తామని, ఈనెల 14వ తేదీ నుంచి సికింద్రాబాద్‌లో జర గనున్న 43వ రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ బాల్‌బ్యాడ్మిటన్ పోటీలలో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కవిత, రాజేశ్వర్, సురేష్, గీత, నరేంద్రచారి, తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు ఆర్థిక సహాయం

ఆర్మూర్‌రూరల్, సెప్టెంబరు 9: ఇటీవల తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో జరిగిన వరద విపత్తుకు అబుదాబికి చెందిన వనిత సభ్యులు సోమవారం ఆర్థిక సహాయాన్ని అందజేశారు. సీఎం రిలీఫ్ ఫండ్‌కు తెలంగాణ ప్రభుత్వానికి రూ.25 వేలు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి రూ.25 వేల చొప్పున అందిస్తూ ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్‌కు లయన్స్ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ అధ్యక్షుడు చెరుకు పృథ్వీరాజ్, ఆయన సతీమణి రోజా డీడీలను అందజేశారు. వరద విపత్తుకు సహకారం అందించిన వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

సుబ్రహ్మణ్య స్వామి ఆలయ సందర్శన



సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న అర్బన్ ఎమ్మెల్యే

మోపాల్,సెప్టెంబరు 9: నగరసమీపంలో ఉన్న బోర్గాం(పి)గ్రామంలో ఉన్న సుబ్రహ్మణ్య స్వామి ఆలయాన్ని సోమవారం నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన ధన్‌పాల్ సూర్యనారాయణకు ఆలయ కమిటీ ప్రతినిధులు ఘనంగా స్వాగతం పలికారు. సుబ్రహ్మణ్య స్వామికి వెండితో తయారు చేసిన రెండున్నర కిలోల నెమలి విగ్రహానికి చింతకాయల రాజేందర్ లక్షన్నర, ఈగరమేష్ రెడ్డి రూ.51వేల కానుకగా ఇచ్చారు. ఆలయంలో అర్బన్ ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. సోమవారం సుబ్రహ్మణ్య స్వామి షష్టి కావడంతో ఆలయానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. ఆలయానికి వచ్చిన భక్తులకు కమిటీ ప్రతినిధులు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అర్బన్ ఎమ్మెల్యే వెంట బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులాచారి, ఆలయ కమిటీ ప్రతినిధులు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

టీయూ లైబ్రరీకి సివిల్ న్యాయాధికారి పుస్తకాల వితరణ



రిజిస్ట్రార్‌కి పుస్తకాలను అందజేస్తున్న సంగారెడ్డి జిల్లా సివిల్‌న్యాయాధికారి

డిచ్‌పల్లి,సెప్టెంబరు9:సంగారెడ్డి జిల్లాసివిల్ న్యాయాధికారిగా కొనసాగుతున్న డా.రాధాకృష్ణన్ చౌహాన్ టీయూ లైబ్రరీకి విలువైన పుస్తకాలను రిజిస్ట్రార్ ప్రొ.యాదగిరికి అందజేశారు.ఈసందర్భంగా రిజిస్ట్రార్ పుస్తకాలు అందజేసిన చౌహాన్‌ను ప్రత్యేకంగా అభినందించారు.తాను చదువుకున్న వర్సిటీలో తెలంగాణ పబ్లిక్‌కమిషన్ నిర్వహించే పోటీ పరీక్షల పుస్తకాలను స్వచ్ఛందంగా ముందుకు వచ్చి వర్సిటీ లైబ్రరీకి ఇండియన్,తెలంగాణఎకనామి,దేశచరిత్ర, సంస్కృతి, రిజనింగ్,జనరల్ ఇంగ్లీష్,జనరల్‌స్టడీస్ వంటి పుస్తకాలనుఅందజేశారు. గతంలో చౌహాన్ న్యాయశాస్త్ర విభాగంలో పీహెచ్‌డీ పూర్తి చేశారు.ప్రస్తుతం సంగారెడ్డి కోర్టు సివిల్ న్యాయాధికారిగాగా విధులు నిర్వహిస్తున్నారు. ఈసందర్భంగా చౌహాన్‌ను రిజిస్ట్రార్ యాదగిరి అభినందించి దాతలు మరికొంత మంది ముందుకు వచ్చి పుస్తకాలు మరిన్ని అందించాలని పేర్కొన్నారు. ఈకార్య క్రమంలో లైబ్రరియన్ సత్యనారాయణ, కాంపిటేటీవ్ సెల్ డైరెక్టర్ రమణచారి, పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలి

డిచ్‌పల్లి, సెప్టెంబరు 9: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 4 లేబర్ చట్టాలు, 3 క్రిమినల్ చట్టాలు వెంటనే రద్దు చేయాలని కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులను, పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు దాసు డిమాండ్ చేశారు. ఈనెల 13న నిజామాబాద్ నగరంలోని పోచమ్మ గల్లి చౌరస్తా ముదిరాజ్ సంఘ పంక్షన్ హాల్‌లో ప్రాంతీయ సదస్సు జరగనుందని ఈకార్యక్రమానికి పంచాయతీ మున్సిపాల్ కార్మికులు పెద్ద ఎత్తున తరలిరావలన్నారు. ఈకార్యక్రమంలో గంగాధర్, బానుచందర్,పోశెట్టి, అబ్దుల్, సుధాకర్, పాల్గొన్నారు.

ఎస్సీ రిజర్వేషన్లలో క్రిమిలేయర్ అమలు చేయాలి

డిచ్‌పల్లి, సెప్టెంబరు 9: ఎస్సీ రిజర్వేషన్‌లలో క్రిమిలేయర్ విధానం అమలు చేయాలని కోరుతూ దళిత వికాస్ సమితి ఆధ్వర్యంలో ఈ నెల 1న ఆదిలాబాద్‌లో ప్రారంభమైన దళిత సమన్యాయం పాదయాత్ర 9వ రోజు సోమవారం ఖిల్లా డిచ్‌పల్లికి చేరుకుంది గ్రామ దళితులు అపూర్వ స్వాగతం పలికారు. ఎస్సీ రిజర్వేషన్‌లలో గత 70 ఏళ్లగా క్రిమిలేయర్ అమలు చేయక పోవడం వల్ల దళితుల్లోని 3శాతం సంపన్న వర్గానికి చెందిన కుటుంబాలే ఎస్సీ రిజర్వేషన్ ఫలాలు పొందుతున్నాయని పేద దళితులు, పోటీ పడలేక నష్టపోతున్నారని సిద్దార్థ ఆరోపించారు. సివిల్స్ అయన వారి విద్యార్థులకు రిజర్వేషన్ అమలు చేయొద్దన్నారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్‌లో చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగాధర్, నర్సయ్య, రాములు, రాజు, పాల్గొన్నారు.

'ప్రజావాణి'కి ఫిర్యాదుల వెల్లువ

● ప్రజావాణి కార్యక్రమంలో సోమవారం 109 ఫిర్యాదులు



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్, తదితరులు

నిజామాబాద్ అర్బన్, సెప్టెంబరు 9: ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యత ఇస్తూ సత్వరమే ఫిర్యాదులను పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మం తు అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో సోమవారం 109 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్ అంకిత్, ట్రైనీ కలెక్టర్ సంకేత్, డీఆర్‌డీవో సాయాగౌడ్, నిజామాబాద్ ఆర్‌డీవో రాజేంద్రకుమార్‌లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సమస్యను పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

● ప్రజాభవన్ ప్రజావాణి 11కు వాయిదా...

తెలంగాణ ప్రభుత్వం ప్రజల అర్జీలను స్వీకరించేందుకు ప్రతీ మంగళవారం, శుక్రవారం మహాత్మ జ్యోతిబాఫూలే ప్రజాభవన్, బేగంపేట హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయిలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని బుధవారంకు వాయిదా వేసినట్లు కలెక్టర్ తెలిపారు. 10వ తేదీ మంగళవారం రోజున 16వ కేంద్ర ఆర్థిక సంఘంతో ముఖ్యమైన సమావేశాలు నిర్వహిస్తున్నందున మంగళవారం జరగవల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని బుధవారానికి వాయిదా వేశారని కావున అర్జీదారులు ఈ మార్పును గమనించి మంగళవారం బదులు బుధవారం రోజున ప్రజావాణికి హాజరుకావాలని ఆయన కోరారు.

● కలెక్టరేట్‌కు వచ్చిన అర్సపల్లి గ్రామస్థులు

నగరంలోని అర్సపల్లి రామర్తి చెరువును కబ్జాదారుల నుంచి కాపాడాలని అర్సపల్లి అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గ్రామస్తులు సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. అర్సపల్లి రామర్తి చెరువు సర్వే నెంబర్ 216లో 29 ఎకరాల విస్తీర్ణంలో ఉందని చెరువు స్థలం అంతా కబ్జాకు గురైందని అనేకసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఇప్పటికైనా కబ్జాదారుల నుంచి చెరువును కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు నర్సయ్య, సాయన్న, నవీన్, బీరప్ప,గంగాధర్, శోభన్ తదితరులు పాల్గొన్నారు.

● అటవీ భూమిని కాపాడాలని వినతి

డిచ్‌పల్లి మండలం కొరట్‌పల్లి గ్రామ శివారులోని సర్వే నెంబర్ 380లో ఉన్న 500 ఎకరాలు, 367 సర్వే నెంబర్‌లో ఉన్న 95 ఎకరాల్లో ఉన్న స్థలం కబ్జాకు గురైందని గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఇప్పటికైనా కబ్జాభూములను కాపాడాలని సర్వే చేసి భూమిని కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో విడిసి అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, ఆశన్న, రాజు, కిషన్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కాళోజీ నారాయణరావు జయంతి



డిగ్రీ కళాశాలలో కాళోజీ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ప్రిన్సిపాల్

ఆర్మూర్‌టౌన్, సెప్టెంబరు9: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం తెలంగాణ భాష దినోత్సవం, కాళోజీ నారాయణరావు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ వై.వేణుప్రసాద్ కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ యాస, భాష, సాంస్కృతికి కాళోజీ చేసిన సేవ గుర్తు చేశారు.తెలంగాణ ప్రాంతంలో జరిగిన అన్యాయాలను ఎదురించిన తీరును ఆయన జీవన గమనంలో ఎదుర్కొన్న అంశాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రొగ్రాం సమన్వయకర్త అంబార్‌సింగ్, వైస్‌ప్రిన్సిపాల్ ఎం. సునీత,రహమాన్,శ్యామ్,జాన్‌సుకుమార్‌లు, యాదగిరి పాల్గొన్నారు.

ముప్కాల్: ముప్కాల్, బాల్కొండ మండలాల్లో కాళోజీ నారా యణరావు జయంతి ఘనంగా నిర్వహించారు. సోమవారం ముప్కాల్ ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు ఎం.గంగారాం కాళోజీ చిత్రపటా నికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అలాగే బాల్కొండ జూనియర్ కళాశాలలో కాళోజీ నారాయణరావు జన్మదిన సందర్భంగా తెలుగుబాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ రాజీయుద్దీన్ అస్లాం కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏర్గట్ల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం కాళోజి నారాయణరావు జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. కాళోజి నారాయణ రావు ఒక గొప్ప ప్రజాకవి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కృష్ణచారి,మునీరోద్దీన్, విద్యార్థులు పాల్గొన్నారు.

నవీపేట: ప్రజాకవి కాళోజి నారాయణ రావు జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని మోకన్‌పల్లి కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ప్రజాకవి కాళోజి నారాయణ రావు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ధర్పల్లి: తెలంగాణ భాష, యాసకు తన కవిత్వం ద్వారా బతికించిన మహోన్నత వ్యక్తి ప్రజాకవి కాళోజి నారాయణరావు అని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతి అన్నారు. కాళోజి నారాయణరావు 110వ జయంతిని పురస్కరించుకొని తెలంగాణ భాషా దినోత్సవం పేరిట కళాశాలలో ప్రిన్సిపాల్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాళోజి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ భాషకు కాళోజి చేసిన సేవలను ఈ సందర్భంగా ఆమె గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు విభాగాధిపతి ప్రభాకర్,వైస్ ప్రిన్సిపాల్ రవిరాజ్, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

● మోడల్ పాఠశాలలో

మండల కేంద్రంలోగల మోడల్ పాఠశాలలో తెలంగాణ భాషా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తెలంగాణ భాష, తెలుగు యొక్క ఉన్నతి తెలిసే విధంగా నాటక ప్రదర్శనలు, ఉపన్యాసాలు, పాటలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రాజేందర్‌సాహెబ్ కాళోజి జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు.

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని ఐకేపి కార్యాలయంలో సోమవారం ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను ఘనం గా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమా లలు వేసి నివాళి అర్పించారు. కాళోజి నారాయణ రావు ఒక గొప్ప ప్రజాకవి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఐకేపి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుంట గంగారెడ్డి, సెర్ప్ ఆడిట్ బృదం సభ్యులు బోజన్న, జనార్థన్, సీనియర్ సిసి రవికుమార్, అనసూయ, ధనలక్ష్మీ, వీవోఏలు సిబ్బంది పాల్గొన్నారు.

భీమ్‌గల్: పట్టణ కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం కాళోజీ జయంతిని పురస్కరించుకొని తెలుగు బాష దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు పండితులు భూమేశ్వర్, ఈశ్వర్‌లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో స్వామి, ఉపాధ్యాయులు లింబాద్రి, రఘువాస్, రాములు, వినోద్, వాసుదేవ్, తదితరులు పాల్గొన్నారు.

మత్తు మందు ఇచ్చి గోవు అపహరణకు యత్నం



ఆవును పరిశీలిస్తున్న గోసేవా ప్రతినిధులు

నిజామాబాద్ కల్చరల్, సెప్టెంబరు 9: నగరంలోనిన్యాల్‌కల్‌రోడ్‌లో రోడ్డుపై ఉన్నఆవుకు మత్తు మందు ఇచ్చి ఆవును అపహరించేందుకు యత్నిస్తుండగా గోసేవా ప్రతినిధులు అడ్డుకున్నారు. సోమవారం తెల్లవారుజామున 2గంటల సమయంలో స్థానికంగా ఉన్నగోసేవా ప్రతినిధులు ఆవును దొంగిలిస్తున్న వారిని అడ్డుకోగా వారు ఆర్‌ఆర్ చౌరస్తా నుంచి గాంధీచౌక్ వైపు పారిపోయారని పేర్కొన్నారు. వెంటనే 100కు డయల్ చేసి సమాచారం అందించగా పోలీసులు వచ్చి ఆవును పరిశీలించారు. తెల్లవారుజామున గోసేవా ప్రతినిధులు అక్కడికి వచ్చి నగరంలోని 4వ టౌన్‌లో ఫిర్యాదు చేశారు.ఫిర్యాదు చేసిన వారిలోగోసేవా సమితి ప్రతినిధులు హరీష్ రెడ్డి, సంపత్,వీహెచ్‌పీ జిల్లా సహకార్యదర్శి ధాత్రిక రమేష్ తదితరులు ఉన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం



ధర్పల్లిలో కాలి బూడిద అయిన గుడిసె

ధర్పల్లి,సెప్టెంబరు 9: మండలంలోని కొటాల్ పల్లి గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి జరిగిన విద్యుత్ షార్ట్ సర్క్యుట్‌తో నివాసపు గుడిసె పూర్తిగా దగ్ధమైంది. బాధితులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన లక్ష్మి తన కుమారుడితో కలిసి పూరి గుడిసెలో నివాసం ఉంటుంది. భర్త నర్సయ్య ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందాడు. ఆదివారం రాత్రి విద్యుత్ షార్ట్‌సర్క్యుట్‌తో మంటలు చెలరేగడంతో ఒక్కసారిగా గుడిసెకు నిప్పంటుకుంది. కుటుంబీకులు బయటకు పరుగెత్తి గ్రామస్తులకు పరిస్థితిని వివరించారు. ఫైరింజన్ వచ్చేలోపే మంటలు వ్యాపించి నివాసపు గుడిసె పూర్తిగా దగ్ధమైంది. వంట సామాగ్రి, బియ్యం బస్తాలు, నగదు కాలి బూడిద అయ్యాయి. తన భర్త దశదిన కర్మకు దాచుకున్న డబ్బులు అగ్నికి ఆహుతి కావడంతో బాధిత కుటుంబీకులు కన్నీరుమున్నీరు అయ్యారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆర్మూర్ చిన్నబాల్‌రాజ్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి ఆదేశాలతో రూ.5వేల నగదును అందజేశారు. అగ్ని ప్రమాదంలో లక్షా 30వేల ఆస్థినష్టం జరిగినట్లు రెవెన్యూ అధికారులు అంచనా వేశారు.

కేజీబీవీలో విద్యార్థులకు కంటి పరీక్షలు

ఏర్గట్ల, సెప్టెంబరు 9: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో సోమవారం రాష్ట్రీయ బాల్ స్వాస్థ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. అందులో భాగంగా డాక్టర్ రాజేశ్వర్ విద్యార్థులకు వైద పరీక్షలు, కంటి పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఎస్‌వో సంధ్య, సిబ్బంది, ఆశావర్కర్‌లు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

● అంత్యక్రియల్లో పాల్గొన్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి



బూక్య సంజీవ్ కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న రూరల్ ఎమ్మెల్యే

సిరికొండ సెప్టెంబరు 9 : కాంగ్రెస్ పార్టీ నాయకుడు భూక్య సంతోష్ కుమారుడు సంజీవ్(16) ఆదివారం రాత్రి కరెంటు విద్యుదాఘాతం వల్ల మృతి చెందడంతో సోమవారం జరిగిన అంత్యక్రియల్లో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి పాల్గొన్నారు. గోప్య తండాలో వినాయకుడి మండపం వద్ద స్పీకర్‌కు విద్యుత్ కనెక్షన్ ఇస్తుండగా విద్యుత్ సరాఫరా కావడంతో విద్యుత్ షాక్ గురయ్యాడు.అక్కడ అందరు చిన్న వయస్సు గల పిల్లలు ఉండడం వల్ల కొంత ఆలస్యంగా కుటుంబ సభ్యులకు తెలిసింది. కుమారుడిని రక్షించుకోవడానికి సంతోష్‌నాయక్ కామారెడ్డి ఆసుపత్రికి తరలించారు ఆసుపత్రికి వెళ్లగానే వైద్యులు పరీక్షించి బాబు చనిపోయాడని వైద్యులు చెప్పడంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు. కుమారుడి శవాన్ని స్వగ్రామానికి తీసుకవచ్చారు సోమవారం సిరికొండ ఎస్సై ఎల్.రామ్ పంచనామా చేసి పోస్టుమార్టం నిమిత్తం నిజామాబాద్ తరలించారు.సోమవారం గ్రామంలో జరిగిన అంత్య క్రియలకు ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి హాజరై సంజీవ్ తండ్రి సంతోష్‌నాయక్,తాత మాజీఎంపీటీసీ సభ్యులు బూక్య రంసింగ్‌ను పరామర్శించి ధైర్యాన్ని చెప్పారు.ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శులు గొల్ల ఎర్రన్న, వెల్మభాస్కర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రవి, జనార్ధన్, సంతోష్‌నాయక్, గంగారెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

ఇందల్వాయి: ఎల్లారెడ్డిపల్లిలో ఆదివారం గుర్రాళ్ల ప్రశాంత్ అనే యువకుడు చెక్ డ్యామ్‌లో ప్రమాదవశాత్తు పడిమృతి చెందిన విషయం తెలిసిందే. సోమవారం గ్రామంలో ప్రశాంత్ అంత్యక్రియలు నిర్వహిస్తుండగా రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ప్రమాదవశాత్తు ప్రశాంత్ మృతి చెందడం బాధాకరమని ఆయన అన్నారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నవీన్‌గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సుధాకర్, నారాయణ, కార్యకర్తలు, పాల్గొన్నారు.

రేషన్ షాపులకు దరఖాస్తుల ఆహ్వానం

డిచ్‌పల్లి, సెప్టెంబరు 9 మండలంలోని యానంపల్లి, ఓసీ దేవపల్లి, బీసీఏ, ఘన్‌పూర్ ఎస్సీ గ్రామాల్లో ఖాళీగా ఉన్న రేషన్ డీలర్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్న తహసీల్దార్ ప్రభాకర్ తెలిపారు. దరఖాస్తులు తహసీల్ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

టీటీసీ ఫలితాల విడుదల

నిజామాబాద్ అర్బన్, సెప్టెంబరు 9: టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్ కోర్సు లోయర్ గ్రేడ్ థియరీ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్.వి. దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. గతనెలలో నిర్వహించిన పరీక్షలకు హాజరైన అభ్యర్థులు తమ ఫలితాలను బిఎస్ఈ.తెలంగాణ.జివో వి.ఇన్ వెబ్‌సైట్‌లో చూసుకోవాలని ఆయన తెలిపారు.

నేడు బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభం

పెద్దబజార్, సెప్టెంబరు 9: ఈనెల 10న ఉదయం 10గంటలకు నిఖిల్ సాయి హోటల్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులాచారి పటేల్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు కొండ విశ్వేశ్వర్‌రెడ్డి, నిజామాబాద్ పార్లమెంట్ సభ్యుడు అర్వింద్ ధర్మపురి, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డిలు పాల్గొంటారని ఆయన తెలిపారు. జిల్లాలోని నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని సభ్యత్వ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

పోలీసులపై దురుసుగా ప్రవర్తించిన వ్యక్తి పై కేసు నమోదు

సిరికొండ సెప్టెంబరు 9: పోలీసులపై దురుసుగా ప్రవర్తించి విధులకు ఆటంకపరిచిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎల్.రామ్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.సిరికొండ మండలం హుస్సేన్‌నగర్ గ్రామానికి చెందిన తీనేటి బుచ్చిరెడ్డి తన భార్యను,కొడుకును కొడుతున్నాడని 100 కాల్ రావడంతో కానిస్టేబుళ్లు, హోంగార్డు వెళ్లి సముదాయించగా వారిపై దురుసుగా ప్రవర్తిండంతో ఆయనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.ఆ సమయంలో బుచ్చిరెడ్డి తాగిన మైకంలో ఉన్నట్లు ఆయన తెలిపారు.

టీయూ ఎంఈడీ 2వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షల ఫీజు వివరాలు ఖరారు

డిచ్‌పల్లి, సెప్టెంబరు 9 తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో సెప్టెంబరు, అక్టోబరు 2024లో నిర్వహించనున్న ఎంఈడీ 2వ సెమిస్టర్ రెగ్యులర్ ఫీజు 13సెప్టెంబరులోపు చెల్లించాలని 100 రూ. అపరాధ రుసుముతో సెప్టెంబరు 19వరకు చెల్లించు కోవచ్చునని సీవోఈ ప్రొ.అరుణ తెలిపారు. పూర్తి వివరాలకు తెలంగాణ వర్సిటీ వెబ్‌సైట్ సంప్రదించలన్నారు.

నేడు నగరంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

సుభాష్‌నగర్, సెప్టెంబరు 9: నగరంలోని డి-2 సెక్షన్ పరిధిలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని నగర టౌన్-2 ఏడిఈ తోటరాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్లమ్మగుట్ట రైల్వేలైన్ పరిధిలో 63 కెవి ట్రాన్స్‌ఫార్మర్‌ను అమర్చడానికి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. ఉదయం 11గంటల నుంచి 12గంటల వరకు ఎల్లమ్మగుట్ట పరిధిలోని ఉమర్ మజీద్, సోని ఫంక్షన్ హాల్, రైల్వేలైన్ పక్కన ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

పూలాంగ్ వాగులో మృతదేహం లభ్యం

ఖిల్లా, సెప్టెంబరు 9: నగరంలోని నాల్గవ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గల దత్తాత్రేయ మందిరం సమీపం నుంచి ప్రవహిస్తున్న పూలాంగ్ వాగులో గుర్తుతెలియని మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. స్థానికుల సమాచారం మేరకు వాగులో మృతదేహం గుర్తించినట్లు పోలీసులకు తెలుపగా నాల్గవ టౌన్ ఎస్సై శ్రీకాంత్ ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడికి సుమారు 30 నుంచి 35 సంవత్సరాల వయస్సు ఉంటుందని ఆయన కుడి చేతిపై అమ్మ అని తెలుగులో పచ్చబొట్టు ఉందని తెలిపారు. ఆచూకి కోసం 8712659840 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

'గణేష్ మండపాల నిర్వాహకులు జాగ్రత్తగా ఉండాలి'

సుభాష్‌నగర్, సెప్టెంబరు 9: గణేష్ మండపాల నిర్వాహకులు విద్యుత్ పట్ల జాగ్రత్తగా ఉండాలని నగర ఏడిఈలు చంద్రశేఖర్, తోటరాజశేఖర్, వీరేశంలు తెలిపారు. గణేష్ మండపం వద్ద ఉన్న కటౌట్స్, సిరీస్ లైట్స్, మైక్‌సెట్‌లను జాగ్రత్తగా వాడాలని కోరారు. ప్రమాదాలు జరుగకుండా నిర్వాహకులు చూసుకోవాలన్నారు. సిరికొండ మండలం కొండాపూర్‌లో కరెంట్ షాక్‌తో 16 ఏళ్ల బాలుడు మృతి చెందాడని ఇలాంటివి పునరావృతం కాకుండా నిర్వాహకులు జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. విద్యుత్ సిబ్బంది ఎప్పటికప్పుడు సహకారం అందిస్తారని ఏదైనా సమస్య ఉంటే విద్యుత్ సిబ్బందికి తెలియజేయాలని కోరారు.

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.85	రూ.200	రూ. 220
వెన్‌కాబ్(కిలో)	రూ.95	రూ.205	రూ. 225

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.74200	రూ.68,400	రూ.890

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : ఉరుకు పటేలా (12.50)
: సరిపోదా శనివారం (3.30, 10.20)
: స్త్రీ-2 (హిందీ) (7.05)
స్క్రీన్-2 : ది గోట్ (10.30, 2.15, 6.00, 9.45)
స్క్రీన్-3 : ది గోట్ (12.15)
: 35-చిన్నకథ కాదు (4.00, 7.05, 10.10)
స్క్రీన్-4 : స్త్రీ-2 (హిందీ) (10.30, 4.20, 10.15)
: స్పీడ్-220 (1.45)
: ఉరుకు పటేలా (7.35)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : 35-చిన్నకథ కాదు (10.35, 4.25)
: సరిపోదా శనివారం (1.20, 7.10, 10.20)
స్క్రీన్-2 : ది గోట్ (10.25, 6.55, 10.25)
: 35-చిన్నకథ కాదు (1.50)
స్క్రీన్-3 : ది గోట్ (12.40, 4.10)
: 35-చిన్నకథ కాదు (7.40, 10.30)

దేవి : ది గోట్ (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : ఉరుకు పటేలా (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : 35-చిన్నకథ కాదు (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహాల్ : సరిపోదా శనివారం (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్